www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 22 ఆగస్టు 2024
5
పశ్చిమ గోదావరి



దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

డిప్యూటీ సిఎం పవన్‌కు ఎంఎల్‌ఎ నాయకర్ వినతి



పవన్‌కళ్యాణ్‌తో బొమ్మిడి నాయకర్

నరసాపురం: నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను కోరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకర్ బుధవారం పవన్‌కళ్యాణ్‌ను కలిశారు. నియోజకవర్గంలోని వివిధ దీర్ఘకాలిక సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నర్సాపురం పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పేరుపాలెం బీచ్‌లో మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మిడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు ఊతం..!

- డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- మండలాల్లో మహిళా మార్టుల ఏర్పాటుకు సన్నాహకాలు
- మహిళలకు ఉపాధి చూపేలా కార్యాచరణ
- 34 వేల డ్వాక్రా సంఘాలకు చేకూరనున్న లబ్ధి

స్వయం సహాయక సంఘాలకు ఊతం కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోబోతోంది. మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ప్రతి మండలంలో మహిళా మార్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో మహిళా మార్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా 34 వేల డ్వాక్రా సంఘాలకు లబ్ధి చేకూరనుంది.

ప్రజాశక్తి - భీమవరం

గత వైసిపి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసింది. అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టింది. కేవలం సంక్షేమ పథకాలను పుష్కలంగా అందించడమే లక్ష్యంగా పాలన ముందుకు సాగింది. ఈ నేపథ్యంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయింది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మార్టులపై చర్యలు తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో జిల్లా అంతా అమలు జరగలేదు. ఒక్క నర్సాపురంలోనే ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతిరోజూ రూ.లక్ష మేర వ్యాపారం సాగింది. దీన్ని జిల్లా అంతా అన్వయించాలని ప్రణాళిక రూపొందించినప్పటికీ మార్టులపై దృష్టి కొరవడింది. దీనికితోడు నరసాపురంలో మార్టులో కూడా రోజుకు సగటున రూ. 40 నుంచి రూ.50 వేల వరకూ అమ్మకాలు పడిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం మహిళా మార్టులు అభివృద్ధి చేసే విధంగా అడుగులు వేస్తోంది. మహిళలు స్వయం ఉపాధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటామని, గతంలో కూటమి హామీ ఇచ్చింది. మహిళల ఆదాయం పెంచుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి మండలంలోనూ మార్టులు ఏర్పాటు చేసి మహిళలే మార్టులు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలకు అవకాశం కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 34 వేల సంఘాలు ఉన్నాయి. వారందరికీ ఉపాధి మార్గం చూపేలా ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. ఏర్పాటు చేసే మార్టుల్లో డ్వాక్రా సభ్యులంతా అక్కడకు వెళ్లి కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. బయట మార్కెట్ కంటే కాస్త తక్కువ ధరకే సరుకులు లభ్యమయ్యే విధంగా చర్యలు తీసుకోమన్నారు. జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. ప్రతి మండల కేంద్రంలోనూ మార్టులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా స్పష్టమైన



ఆదేశాలు జారీ చేసింది. గతంలో జిల్లాలో నర్సాపురం, పాలకోడేరు, అత్తిలి, పెనుగొండ, తణుకు రూరల్ మండలాల్లో మార్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నరసాపురంలో మాత్రం మార్ట్ ఏర్పాటు చేశారు. మిగిలిన మండలాల్లో డ్వాక్రా సభ్యుల నుంచి పూర్తిస్థాయిలో సొమ్ములు వసూలు చేయలేకపోయారు. ప్రతి సభ్యురాలి నుంచి రూ.200 వంతున వసూలు చేస్తారు. అంటే ఒక్కో గ్రూపు రూ.2000 చెల్లించాలి. మహిళా పొదుపు నుంచి, లేదంటే రుణాల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయనున్నారు. మార్టుల్లో పెట్టుబడి పెడతారు. వచ్చిన లాభాలను కూడా అదే మార్టులో మళ్లీ పెట్టుబడి పెడతారు. సిబ్బందికి వేతనం ఇస్తారు. దీనివల్ల బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే సరుకులు మహిళలకు లభ్యం కానున్నాయి. ప్రతి మార్టులోనూ కనిష్టంగా ఆరుగురికి ఉపాధి లభించనుంది.

సొమ్ములు వసూలైన తర్వాతే మార్టుల ఏర్పాటు..


గత వైసిపి ప్రభుత్వ హయాంలో మార్టుల ఏర్పాటుకు ప్రతి డ్వాక్రా సభ్యురాలి నుంచి రూ.200 చొప్పున వసూలు చేయడం జరిగింది. ఒక గ్రూపు నుంచి రూ.2000 వరకూ వసూలు చేశారు. అయితే మహిళా మార్టుల ఏర్పాటు కాకపోవడంతో గతంలో వసూలు చేసిన సొమ్ములపై అధికారులు ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో మార్టుల వ్యవహారం పక్కనపెట్టింది. దీంతో రూ.2 వేలు చెల్లించిన మహిళా గ్రూపుల గుబులు చెందుతున్నాయి. తాము చెల్లించిన సొమ్ములకు భరోసా లేకుండా పోయిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రతి మండలం నుంచి సొమ్ములు వసూలు చేసిన తర్వాత మార్టుల ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

మహిళలకు మరింత ఊరట..

మహిళా మార్ట్ కోసం సభ్యులే పెట్టుబడి పెడుతున్నారు. దాంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు కల్పిస్తే మార్టులు బలోపేతం అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కల్పిస్తే మహిళలకు మరింత ఊరట లభించే అవకాశం ఉంది. తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దానికితోడు డ్వాక్రా సంఘాలు తయారు చేసే వస్తువులను కూడా మార్టుల్లో అమ్మకానికి పెట్టనున్నారు. తద్వారా డ్వాక్రా సంఘాలకు కూడా ఉపాధి లభించనుంది. ఫలితంగా మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. ప్రస్తుతం రుణాలు తీసుకుని అనేకమంది సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఎటువంటి ఉత్పత్తులు తయారు చేయడం లేదు. డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల అమ్మకానికి ఈ మార్టులు ఉపయోగపడతాయి. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

ఎస్‌టిల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాలో ఎస్‌టిల వెనుకబాటుతనాన్ని పూర్తిస్థాయిలో తొలగించి, వారి సర్వతోముఖాభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం గొల్లవానితిప్పరోడ్డులోని ప్రకాష్ నగర్ ఎస్‌టి కాలనీని ఆమె సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారి జీవనశైలిని పరిశీలించి, వీరి పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు ఉన్నాయా, పిల్లలందరూ బడికి వెళ్తున్నారా, డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు సభ్యులుగా చేరారా అనే విషయాలపై ఆరా తీశారు. అక్కడే ఉన్న రాజీవ్ క్రాంతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానికంగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను చదివించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. మీలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే నర్సులు వస్తున్నారా, వైద్యం చేస్తున్నారా అని ప్రశ్నించారు. శుభ్రత పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎప్పుడో క్రితం ప్రభుత్వం ఇళ్లు నిర్మించిందని, రోడ్లు కన్నా ఇళ్లు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో అధిక వర్షాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మీ అందరికీ మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో తాను విధుల్లో చేరిననాటి నుండి జిల్లా అంతటా ఎస్‌టి కాలనీలో పర్యటిస్తూ అధికారులను ఆదేశిస్తున్నామని చెప్పారు. గృహనిర్మాణ పథకం కింద అర్హులకు ఇళ్లు నిర్మించి ఇస్తారని తెలిపారు. సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి బి.సుజాతరాణి, సహాయ కమిషనర్ ఎ.శ్రీవిద్య, తహశీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్, రెవెన్యూ, మెప్మా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

డిటిఒకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం



జిల్లా గణాంకాల అధికారితో మాట్లాడుతున్న నేతలు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాతల జేమ్స్, డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. స్థానిక ట్రెజరీ కార్యాలయంలో జిల్లా ట్రెజరీ గణాంకాల అధికారి (డిటిఒ)ని సంఘం జిల్లా నేతలు కలిసి పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. పెన్షనర్ల సమస్యలపై కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని డిటిఒను కోరారు. దీనిపై స్పందించిన డిటిఒ వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబంలో పెన్షనర్ల పుట్టిన తేదీ లేని వారికి నమోదు చేయడానికి ప్రభుత్వం నుంచి త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని చెప్పారు. ఆదాయపు పన్ను మినహాయింపు ప్రతినెలా వారి పెన్షన్ నుండి మినహాయించాలని కోరితే వారికి కొత్త శ్లాబ్‌లో మినహాయింపు చేస్తామని చెప్పారు. అనంతరం సుపుత్ర దినోత్సవ రోజున కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న డిపిఒ గణేష్, సీనియర్ అక్కౌంటెంట్ జగదీశ్వర్‌రాజు, సహాయకులు సూర్యనారాయణను సంఘం తరపున సత్కరించి అభినందించారు. డిటిఒను కలిసిన వారిలో ట్రెజరర్ రవిప్రసాద్, భీమవరం శాఖ ప్రధాన కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కర రావు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గంలో ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ రాజేశ్వరి కోరారు. సెకండరీ స్కూల్, జూనియర్ కళాశాలలు, ఐటిఐ, ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల్లో మూడేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులని పేర్కొన్నారు.

ఆకివీడు-దిగమర్రు రహదారి నిర్మాణానికి నివేదిక

అధికారులకు కలెక్టర్ నాగరాణి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

ఆకివీడు-దిగమర్రు జాతీయ రహదారి-165 నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్లతోపాటు సాధ్యాసాధ్యాల నివేదికలను తయారు చేసి త్వరితగతిన అందజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఎన్‌హెచ్-165, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులతో జాతీయ రహదారి-165 నిర్మాణానికి సమర్పించిన మూడు అలైన్‌మెంట్లపై క్షుణ్ణంగా సమీక్షించారు. తొలుత ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికే రూపొందించిన మూడు అలైన్‌మెంట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మూడు అలైన్‌మెంట్లకు సంబంధించి విడివిడిగా ఖర్చు, లాభనష్టాలు, భూసేకరణ వివరాలు, విషయాలను బేరీజు వేసుకుని రానున్న వారం రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, రైల్వే శాఖ ఎడి ఎన్.శంకర్ రామాంజనేయులు, నేషనల్ హైవే 165 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సంజీవరాయుడు, ఆర్‌అండ్‌బి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

అధికారి ఎల్.లోకేశ్వరరావు, విద్యుత్ శాఖాధికారి పీర్ అహ్మద్‌ఖాన్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, నేషనల్ హైవే పరిధిలోని ఆయా మండలాల తహశీల్దార్లు, డిటిలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నరసాపురంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

నరసాపురం వైఎన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న నిర్వహించే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ, గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిశ్రమల శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువమంది ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైనవారు డ్రాప్‌వుట్ కాకుండా వారి తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించి, ఉద్యోగంలో చేరే విధంగా చూడాలన్నారు. ఇష్టపడి ఇంటర్వ్యూలకు వచ్చేవారు ఎవరైనా ఉంటే మరో రెండు రోజులు వారికి అవకాశం కల్పించాలన్నారు. సోలార్, డ్రోన్ టెక్నాలజీ ట్రైనింగ్‌కు అగ్రికల్చర్, హార్టికల్చర్ డిపార్టుమెంట్ వారిని సంప్రదించి ప్రదేశాలను గుర్తించాలన్నారు. డిఆర్‌డిఎ, స్కిల్ డెవలప్‌మెంట్, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వీలైనంత ఎక్కువమంది ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌ఎస్‌ఎస్.వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పుష్పరాణి, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి భానుమతి పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

పలుచోట్ల నిరసనల ర్యాలీ



భీమవరం : నిరసన తెలిపి మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం : వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం భీమవరంలో నిరసన ధర్నా నిర్వహించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ప్రకాశం సెంటర్ వరకు వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్ మాట్లాడుతూ కిరాతకంగా హత్యాచారం చేసి హత్యచేయటం సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సిహెచ్.మహాలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై హత్యాచారాలు, హత్యలు అరికట్టాలని, దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బెంగాల్ ముఖ్యమంత్రి ఒక మహిళ అయి ఉండి మహిళల రక్షణకు చర్యలు తీసుకోకపోవటం దారుణం అన్నారు. ఈ ధర్నాలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ, పి.శ్రీను, మాధవి, కె.అప్పన్న, నాని, కె.గోపాలరాజు పాల్గొన్నారు.

ఆకివీడు : అత్యాచారం చేసిన నరరూప రాక్షసులకు వెంటనే మరణ శిక్ష విధించాలని ఆదిత్య విద్యాసంస్థల అధినేత ధ్యానరత్న డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు డిమాండ్ చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను అతి కిరాతకంగా హింసించి, హత్యాచారం చేసి దారుణంగా హత్యచేసిన వారిని వెంటనే శిక్షించాలని, వారికి మరణ శిక్ష విధించాలని, కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం స్థానిక ఆదిత్య విద్యాసంస్థల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఇటువంటి దురాగతాలకు పాల్పడాలి అంటే భయం కలిగే విధంగా బలమైన చట్టాలు రావాలని తెలిపారు. రిటైర్డ్ హెచ్‌ఎం ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కాకర్ల రాజరాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో స్త్రీలను గౌరవించే విధంగా తల్లిదండ్రులు తమ బిడ్డలను పెంచాలన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులకు శిక్షలు కఠినంగా ఉండేలా చట్టాలు మార్చాలన్నారు. న్యాయం జరగాలంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు.

తణుకు : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై



ఆకివీడు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హత్యాచారానికి పాల్పడిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సిఐటియు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సాలిపేట నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, బొక్క ప్రమీల, యండమూరి నాగేంద్ర, గుత్తుల వసంత కుమారి, కళ్యాణి, రాణి, బళ్ల నాగలక్ష్మి, కుడకా వీరభద్ర రావు, రెడ్డి లీల నాగవేణి, వెన్న దుర్గ దేవి పాల్గొన్నారు.

విష జ్వరాలను అరికట్టండి : సిపిఎం

ఆకివీడు: రోజురోజుకి విజృంభిస్తున్న విషజ్వరాలను అదుపు చేసేందుకు పట్టణ వ్యాప్తంగా ఉన్న నివాస ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సిపిఎం కోరింది. స్థానిక 74 ఎకరాల తాళ్లకోడు కాలనీలో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడ పరిస్థితులు గమనించిన అనంతరం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్(ప్రభుత్వ ఆసుపత్రి) మెడికల్ అధికారికి సిపిఎం బృందం వినతిపత్రం అందజేశారు. మెడికల్ అధికారి కె.వెంకటపతిరాజు స్పందిస్తూ అవసరం ఉన్నచోట తప్పనిసరిగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావులు మాట్లాడుతూ ఓ పక్కన వర్షాలు, మరో పక్కన ఎండలతో ప్రజలు తీవ్ర అస్వస్థకు గురవుతున్నారని తెలిపారు. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోవడంతో దోమలు విజృంభించి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు కనీసం ఒక్క వీధిలో కూడా బ్లీచింగ్ చల్లడం లేదని విమర్శించారు. తక్షణమే పట్టణంలో ఉన్న మురికి వాడలు, నివాస ప్రాంతాల్లో శానిటైజ్ చేయించి జ్వరాల బారిన నుంచి ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బివి.వర్మ, డి.రవితేజ ఉన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ విజయవంతం

ప్రజాశక్తి - ఆచంట

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పును పున:సమీక్షించుకోవాలని అంబేద్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. అంబేద్కర్ యువసేన, మాల మహానాడు, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆచంట కచేరి సెంటర్‌లో యువత ఆచంట-మార్టేరు ఆర్‌అండ్‌బి రహదారిపై బైఠాయించారు. మాల మహానాడు నాయకులు కోట వెంకటేశ్వరరావు, మట్టా చంటి, బీర నరసింహమూర్తి, మట్ట ఆనంద్ కుమార్, సరేళ శ్రీనివాస్, బొరుసు రాంబాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఎస్‌సి వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు తీర్పుకు నిరసనగా బుధవారం దళిత సంఘాలు చేపట్టిన భారత్ బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ప్రయివేట్ విద్యాసంస్థలు అన్నీ మూసివేయగా మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు వెళ్లడం కనిపించింది. ఈ సందర్భంగా మార్టేరు సెంటర్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి బంద్ నిర్వాహకులు పాలాభిషేకం చేశారు. మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు.

కాళ్ల : ఎస్‌సి వర్గీకరణతో మాలలకు అన్యాయం చేసేందుకు కుట్ర జరుగుతుందని మాల మహాసేన జిల్లా అధ్యక్షులు మర్రి కృపాదానం అన్నారు. ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారత్ బంద్ బుధవారం కాళ్ల మండలంలో ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాజ్ కుమార్, మండల అధ్యక్షులు సరెళ్ల వినోద్‌కుమార్, కటారి పృధ్వీరాజ్, యోబు, ఇస్సాకు పాల్గొన్నారు.



పెనుమంట్ర : అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఆందోళనకారులు

తణుకు : భారత్ బంద్ కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి వ్యాపార, విద్య సంస్థలను మూయించివేశారు. మహిళా కళాశాల వద్ద జాతీయ రహదారి పై రాస్తారోకో నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్ వర్మకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మర్రి నవీన్‌బాబు, దళిత నాయకులు మోలుం మైకేల్, కేసరపల్లి వెంకట్రావు, పొట్ల సురేష్, పాతూరి నరేంద్రబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : ఎస్‌సి విభజనకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో తలపెట్టిన బంద్ ఆకివీడులో నామమాత్రంగా జరిగింది. ప్రభుత్వ విద్యాసంస్థలు, బ్యాంకులు మినహా మిగిలిన వ్యవస్థ మొత్తం యథాతథంగా నడిచింది.

గణపవరం : ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన బంద్ ప్రభావం గణపవరంలో పూర్తిగా కనపడలేదు. మండలంలో మాత్రం విద్యాసంస్థలు పూర్తిగా



ఆచంట: రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నేతలు

మూతపడ్డాయి. బస్సులు మాత్రం మధ్యాహ్నం నుంచి తిరిగాయి.

తాడేపల్లిగూడెం : ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునరాలోచించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో బంద్ పాక్షికంగా జరిగింది. కొన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సంఘీభావంగా మూసివేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెనుగొండ : ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణకు వ్యతిరేకంగా సిద్ధాంతం జెఎసి నాయకులు చిన్న ఏడుకొండలు, కప్పల రతన్ రాజు ఆధ్వర్యంలో బంద్‌ను నిర్వహించారు. బుధవారం స్వచ్ఛందంగా దుకాణాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ సంస్థలు మూసివేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనుగొండ గాంధీ బొమ్మ సెంటర్లో పహారా నిర్వహించారు. జెఎసి నాయకులు పాల్గొన్నారు.

పాలకోడేరు : ఎస్‌సి వర్గీకరణ వద్దు-ఐక్యతే ముద్దు అని ఎపి మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కొండేటి లాజరు అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో లాజర్ ఆధ్వర్యంలో భారత్ బంద్‌ను బుధవారం నిర్వహించారు. పాలకోడేరులో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. పోతురాజు, అశోక్, ఏసోబు, పారుపూడి రాహుల్, తాళ్లూరి సంతోష్, జాన్‌పాల్, కొండేటి అవినాష్, కమలం, డి.శ్రీకర్, వెంకట్రావు డి.హనోక్, రాజీవ్ కుమార్, సాహుల్, నవీన్, నాని, రత్నంరాజు, లోకేష్, అన్వేష్, సన్నీ పాల్గొన్నారు.

ఉండి: బంద్ నేపథ్యంలో మండలంలోని ప్రయివేటు పాఠశాలలు పూర్తిగా మద్దతు తెలిపి మూసివేయగా, ప్రభుత్వ పాఠశాలలు యధాతథంగా తెరచుకున్నాయి. వాణిజ్య సంస్థలు ఉదయం 11 గంటల తర్వాత తమ వ్యాపారాన్ని నిర్వహించుకున్నాయి. ఈ బంద్‌లో కేవలం జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆధ్వర్యంలోని మాల మహానాడు మాత్రమే పాల్గొనగా మిగిలిన సంఘాలు దూరంగా ఉన్నాయి. జిల్లా యువజన అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, మాల మహానాడు నాయకులు మేడిది సాయి జగన్నాథ్, తొర్లపాటి భాగ్యరాజు, పారుపూని రాహుల్, నాగరాజు పాల్గొన్నారు.

నరసాపురం: ఎస్‌సి వర్గీకరణను నిలిపివేయాలంటూ మాల మహానాడు చేపట్టిన బంద్‌తో నరసాపురంలో దుకాణాలు మూతపడ్డాయి. 216 జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. హోటల్లు, టిఫిన్ సెంటర్లు తెరుచుకోలేదు. ఆర్‌టిసి బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఆందోళనకారులు రాస్తారోకో చేసి వర్గీకరణను నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు.

పాలకోడేరు : గోరగానముడి శ్రీచైతన్య యువజనసంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ నిర్వహించారు. యువజన సంఘ ప్రెసిడెంట్ చిల్లా లెనిన్ బాబు, ట్రెజరర్ పొన్నమండ బుజ్జిబాబు, రెండో వార్డ్ మెంబర్ పితాని నవీన్, తులసి చంద్రమోహన్, గ్రామ పెద్దలు గోడి దానియేలు, మట్టా శ్యాంబాబు, రామకృష్ణ, మాకా శ్రీను, గడ్డం శాంతరావు, ఏరియా మాల సంఘం నాయకులు పాల్గొన్నారు.



పాలకోడేరు : నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

మొగల్తూరు : ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ మండలం వ్యాప్తంగా విజయవంతమైంది. మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో మాల మహానాడు జెఎసి నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. నాయకులు పడవల సత్యనారాయణ, కాకర విజయ ప్రసాద్, డొల్ల రత్నంరాజు, వర్ధనపు సుధాకర్, మైలాబత్తుల రాంబాబు, ఇంజేటి కుమారస్వామి ఉన్నారు.

తణుకు: ఎస్‌సి వర్గీకరణకు మద్దతుగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పున్హసమీక్షించాలని కోరుతూ వివిధ దళిత సంఘాలు ఇచ్చిన భారత బంద్ పిలుపునకు మద్దతు తెలుపుతూ బుధవారం అత్తిలిలో దళిత నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని బంద్ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, మానవహారం నిర్వహించారు. నాయకులు పొనుకు వినయ్ బాబు, బట్టు నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, ఈడూరి రాంబాబు, రేవులగడ్డ భద్రయ్య, తెలి సుందరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ పాలకొల్లులో పూర్తిగా, ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఆర్‌టిసి బస్సులు పూర్తిగా నడపనప్పటికి మధ్యాహ్నం నుంచి పాక్షికంగా సర్వీసు లు నడిపారు. యువకులు మోటార్ సైకిళ్ల పై ర్యాలీ నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు

తొలగించాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం లోని 7వ వార్డులో కోవెల గుడి సమీపంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పాదులు పెరిగిపోయాయి. దీంతో సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ తీగలపై పాదులను తొలగించాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌పై దట్టంగా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: పంచాయతీలోని కనీస అవసరాలపై కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో సుమారు రూ.12 లక్షల 50 వేలతో నిర్మించనున్న సిసి రోడ్డు, జెడిపి హైస్కూల్ వెళ్లే గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీల నిధులను దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల అభివృద్ధే పనిచేయనున్నామన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం త్వరలో జరిగే గ్రామసభల్లో ప్రజా సమస్యలు తీర్చేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకొని గ్రామాల్లోని గ్రూపుల అతీతంగా అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ఆదేశించారు.



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలలో భాగంగా బుధవారం 6వ రోజు చిట్టవరం గ్రామంలో కీర్తిశేషులు డాక్టర్ శిరిగినీడి నాగభూషణం జ్ఞాపకార్థం భవాని హోమియో నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ శిరిగినీడి రమేష్, రాజ్యలక్ష్మి దంపతులు తమ వైద్యసేవలను సుమారు 150 మందికి అందించారు. అంజనాపుత్ర చిరంజీవి పవన్ కళ్యాణ్ యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్యసేవలను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ రమేష్, రాజ్యలక్ష్మి దంపతులు భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలను వారు నిర్వహించాలని ఆకాంక్షించారు. నరసాపురం చినమిల్లి దయాగ్నోస్టిక్స్ వారిచే ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజనా సత్తిబాబు, కోవల్లి శ్రీనివాస్, పోలిశెట్టి బాబి, గ్రంధి శ్రీను, పైడికొండల కృష్ణ, రేవు ప్రభుదాస్, అల్లూరి బాబి, పులపర్తి సుబ్బారావు, చెన్నంశెట్టి నాగు, ఇద్దుమిల్లి రాజు, కర్రా సూరిబాబు, కేసరి రంగారావు, విస్సా బుజ్జి, సత్తిరాజు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆప్సద, ఎంపెడా నిబంధనలు పాటించాలని, ప్రభుత్వం వారి అన్ని అనుమతులు పొంది సాగు చేసుకుని లాభదాయకమైన ఫల సాయం పొందాలని మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్ఎన్ ప్రసాద్ తెలియజేశారు. మండలంలోని చందపర్రు గ్రామంలో మత్స్యశాఖ అధికారులు ఆక్వా రైతులు, డీలర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులను డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 1.24 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు చేస్తుండగా కేవలం 45 వేల ఎకరాలకు మాత్రమే రైతులు అనుమతి పొందారన్నారు. మండల మత్స్యశాఖ అధికారి ఎల్ఎస్ఎన్ రాజు, క్షీరపురి ఆక్వా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బోనం వెంకట నరసయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టంపై గ్రామసభ

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి హామీ చట్టాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అర్తమూరు గ్రామ సర్పంచి గోనబోయిన వీర్రాజు, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు సూచించారు. బుధవారం ఉపాధి హామీ చట్టంపై గ్రామసభను అర్తమూరు పంచాయతీ కార్యదర్శి రాజు సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచి, ఎంపిటిసిలు మాట్లాడుతూ గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలీకి 100 రోజుల పని దినాన్ని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ పోతుల నవీన్‌కు సూచించారు.

25న శ్రీరామ్మూర్తి సంస్మరణ సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆమడలి వలవల శ్రీరామ్మూర్తి సంస్మరణ సభ పాలకొల్లులోని అంబేద్కర్ భవనంలో ఈనెల 25 ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల సిపిఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ తెలిపారు. ఈ సంస్మరణ సభలో సిపిఎం సీనియర్ నేతలు, రైతు, ఉపాధ్యాయ నేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు. సభలో జిల్లా సిపిఎం కార్యదర్శి బి బలరాం, మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు పాల్గొంటారని తెలిపారు.

చెరువు తవ్వకం అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధి నక్కవారిపాలెం గ్రామంలో పంట పొలాల మధ్యలో సమీప రైతు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేపలు చెరువు తవ్వుతున్నారని రైతులు ఆరోపించారు. అక్రమంగా చేపల చెరువులు తవ్వడం వల్ల తమ వ్యవసాయ భూములు పంట పండించుకునేందుకు పనికి రాకుండా నష్టపోయి జీవనాధారం కోల్పోతున్నామని రైతులు పిల్లి శ్రీనివాసరావు, పిల్లి వెంకట నాగరాజు, కడలి మహేశ్వరి, కడలి దుర్గలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు పొలాల సమీపంలో అక్రమంగా తవ్వుతున్న చేపల చెరువులను అడ్డుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంట పొలాల మధ్యలో అక్రమంగా తవ్వుతున్న చెరువును నిలుపుదల చేయాలని కోరారు.

యువతి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఫిలోమినా సోఫీ (24) అనే యువతి ముగ్గురు వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు సిఐ యాదగిరి తెలిపారు. మిషన్ నికోబార్ దీవులకు చెందిన ఫిలోమినా తల్లిదండ్రులతో కలిసి 10 రోజుల క్రితం నరసాపురం పట్టణం వచ్చింది. మిషన్ హైస్కూల్ రోడ్డులో నివాసం ఉంటుంది. మంగళవారం ఇంటిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. దీనిపై ఆమె పెద్దమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఒంటిపై కొన్నిచోట్ల గాయాలున్నాయని వాటిపై కూడా కుటుంబ సభ్యులను ఆరా తీసినట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


ప్రజాశక్తి - ఉండి

మతిస్థిమితం లేని తన భర్త అదృశ్యం అయ్యాడని ఉండి మండలం పాందువ్వ కండ్రిక గ్రామానికి చెందిన పసుపులేటి సీతామహాలక్ష్మి ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాందువ్వ కండ్రిక గ్రామానికి చెందిన పసుపులేటి ప్రభాకర్ రావుకు గత ఐదు సంవత్సరాలుగా మతిస్థిమితం సరిగాలేదు. ఈనెల 17వ తేదీ రాత్రి భోజనం తర్వాత పడుకుని ఉదయం నాలుగు గంటలకు భర్త కనిపించలేదని అన్నారు. నాటి నుంచి ఇంటి చుట్టుపక్కల ఇళ్ల వద్ద, బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఆచూకీ దొరక్కపోవడంతో బుధవారం ఉండి పోలీస్ స్టేషన్లో ప్రభాకర్ రావు భార్య సీతామహాలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఉండి ఎస్ఐ మహమ్మద్ నజీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు విలవిల

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు పరిసర గ్రామాల్లోని ప్రజలకు మళ్లీ కరెంటు కష్టాలు వచ్చాయి. బుధవారం మార్టేరు, పరిసర గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకుండా ఉదయం నుంచే విద్యుత్ కోత మొదలైంది. అది సాయంత్రం అయినా అలాగే కొనసాగిందని ఎండ, ఉక్కపోతతో చిన్న పిల్లలు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రులలోని రోగుల పరిస్థితి వర్ణనాతీతం. మార్టేరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు పూర్తిస్థాయి అధికారి లేకపోవడం, ఇన్‌ఛార్జి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే తరచూ ఈ పరిస్థితి ఎదురవుతుందని స్థానికులు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న శ్రీదేవి ట్రస్టు సభ్యులు

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామం వెంకటాపురం గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. గ్రామస్తుల ద్వారా ఆ విషయం తెలుసుకున్న దాట్ల శ్రీదేవి ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకటరామరాజు మజ్జిలక్ష్మి అంత్యక్రియలకు రూ.5 వేలు పంపగా ట్రస్ట్ సభ్యులు సోమవారం గ్రామస్తులతో కలిసి మృతిరాలి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల నగదును అందజేశారు. ట్రస్ట్ సభ్యులు కట్టా సతీష్, పెన్మెత్స నాగరాజు, ఈదా భోగేష్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కాళ్ల

తాడేపల్లి పిఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్ ఆదేశాల మేరకు సర్పంచిలకు, కార్యదర్శులకు రిఫ్రెషర్ శిక్షణా తరగతులు ఈనెల 19 నుంచి 21 వరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జి.స్వాతి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం, కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రాసెసర్, పారిశుధ్యం, గణవ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, గ్రామపంచాయతీ సంబంధిత గైడ్‌లైన్స్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టం, వేస్ట్ కలెక్షన్ ప్రాసెసర్, వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్, వీధి దీపాలు వాటి నిర్వహణ, చెల్లింపులు, గ్రామ స్వరాజ్ పోర్టల్ వంటి అంశాలపై సవివరంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. హాజరైన ప్రతిఒక్కరూ శిక్షణా తరగతుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్, కోలనపల్లి గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణమూర్తి, ఎల్ఎన్.పురం సర్పంచి టి.నాగరాజు, సీసలి సర్పంచి బి.ధనలక్ష్మి, విస్తరణాధికారి ఎంవి.భాస్కరరావు, బి.సతీష్ కుమార్, డి.సునీల్ రాజు, బాలకృష్ణ, ఎస్.అరుణకుమారి, దొంగ సత్యనారాయణ, పలు గ్రామాల గ్రామ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు వీధిలైట్ల నిర్వహణపై మూడవరోజు బుధవారం శిక్షణా తరగతులు ఎంపిడిఒ ఉండు బాబ్జిరాజు వివరించారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ముగిసాయి. ఇఓపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, కార్యదర్శులు ఐఎస్ఎన్.రాజు, పి.సాయిరామ్, వై.కృష్ణ, పంచాయతీ నిర్వహణ పారిశుధ్యం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు.

14న జాతీయ లోక్ అదాలత్

తాడేపల్లిగూడెం: సెప్టెంబర్ 14న తాడేపల్లిగూడెం కోర్టుల సముదాయంలో నేషనల్ లోక్‌అదాలత్ జరగనున్నదని తాడేపల్లిగూడెం మండల సర్వీసెస్ కమిటీ చైర్మన్, పదకొండవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, మోటారు వాహనాల ప్రమాదబీమా కేసులు, బిఎస్ఎన్ఎల్, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల మధ్య రాజీ చేసి పరిష్కరించబడునని, అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవలసినదిగా, కక్షిదారులకు రాజీమార్గమే రాజ మార్గమని జిల్లా జడ్జ్ సికిందర్ బాషా తెలిపారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు

గణపవరం: మండలంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 22వ తేదీ గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు ఆక్వాసాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు గణపవరం ఎఫ్‌డిఒ శివరామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోగల ఆక్వారైతులు, డీలర్లు సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సు ఎంపిడిఒ, అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

వీధి విక్రయదారుల సంక్షేమానికి గుర్తింపు కార్డులు అందజేత

తణుకు: సంచార నాలుగు చక్రాల బండ్లపై మిక్చర్, బజ్జీ, పానీపూరి అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్న వీధి విక్రయదారుల సంక్షేమానికి తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తమ వంతు సహకారం అందించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం సభ్యులు బుధవారం ఎంఎల్ఎ కార్యాలయంలో రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వీధి విక్రయదారుల ఉపాధికి భద్రత కల్పించాలని, సబ్సిడీపై రుణాలు ఇప్పించాలని, వీధి విక్రయదారుల సంక్షేమానికి కృషి చేయాలని ఎంఎల్ఎను కోరారు. అనంతరం రాధాకృష్ణ చేతుల మీదుగా సంఘ గుర్తింపు కార్డులు అందుకున్నారు. బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం అధ్యక్షులు కిలాని శ్రీనివాస్, కార్యదర్శి రేలంగి రాజు, ఉపాధ్యక్షులు రవిపతి, కమిటీ సభ్యులు బూర సింహాచలం, నొడగల శ్రీనివాస్, బూర అప్పలరాజు, నక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల ఆధునీకరణ పూర్తి చేసేందుకు కృషి

ఉండి: ఉపాధ్యాయ దినోత్సవ నాటికి ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధునీకరణ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు మంతెన సాయి లచ్చిరాజు తెలిపారు. ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు శత వసంతాల ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పూర్తిస్థాయిలో అన్ని హంగులతో పూర్తి చేయాలన్నదే ఎంఎల్ఎ లక్ష్యం అని అన్నారు. పాఠశాలలోని క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, లాంగ్ జంప్ వంటి క్రీడలకు అవసరమైన ఏర్పాట్లు చేసి విద్యార్థులను జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునేలా రఘురామకృష్ణంరాజు ఆధ్వర్యంలో తీర్చిదిద్దుతాం అన్నారు. ఇందుకూరి గజపతిరాజు, ముదునూరి కృష్ణంరాజు, ముదునూరి రవివర్మ, పెన్మెత్స గోపిరాజు, ముదునూరి శ్రీహరి రాజు వంటి వారి సహకారంతో పాఠశాల అభివృద్ధి పనులు పూర్తిచేసి ఉపాధ్యాయ దినోత్సవ నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు మంతెన సాయిలచ్చిరాజు తెలిపారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షునిగా శ్రీనివాస్

ఉండి: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఉండి మండల అధ్యక్షునిగా పి.శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సత్యనారాయణ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తుందని అన్నారు.

అధ్వానంగా మరుగుదొడ్డి

ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ బస్టాండ్ వద్ద ఉన్న మరుగుదొడ్డి అధ్వానంగా మారడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వేలాదిమంది రావులపాలెం, రాజమండ్రి, తణుకు, నిడదవోలు, నరసాపురం, భీమవరం చుట్టుపక్కల గ్రామాలకు ప్రయాణం చేస్తుంటారు. ఇక్కడ కనీసం మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుగొండ పుణ్యక్షేత్రమైన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి ఇతర రాష్ట్రాలైన బెంగళూరు, తమిళనాడు ఇలా పలు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వాసవి మాతను దర్శించుకోవడానికి వస్తుంటారు. అదే సమయంలో కాలకృత్యాలు తీర్చుకుందామని వెళదామంటే ఇప్పటికీ మరుగుదొడ్డిని చూసి వెనకకు తిరిగి రావాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రభుత్వాలు మారుతున్నా ప్రజాప్రతినిధులకు కనీసం సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన కూడా రాదని, పలుమార్లు పత్రికల ద్వారా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా ప్రయోజనం లేదని, బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూపులు చూస్తుంటే దోమల దాటికి తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు భయభ్రాంతులతో ప్రయాణాలు చేయవలసి వస్తుందని, ఈ ప్రదేశాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరించడంతో నరకయాతనకు గురికావాల్సి వస్తుందంటున్నారు. షుగరు పేషెంట్లు హాల్ బయట తమ పనులు తీర్చుకోవాల్సి వస్తుందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.



బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్డి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆకివీడు

వృద్ధులకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందని, ఈ సహకారాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ ఆకివీడు మండల వృద్ధుల సంక్షేమ సంఘం, స్థానిక లయన్స్ క్లబ్ సహకారంతో లయన్స్ ఆడిటోరియంలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య అధ్యక్షతన జరిగిన సభలో కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మరో అతిథి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులకు అన్ని విధాలా తమ అండ ఉంటుందన్నారు. అనంతరం బంగారయ్య మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా సంస్థ వృద్ధులకు చేసిన సేవలను వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పల్లి అప్పిరెడ్డి సహకారంతో పేద వృద్ధులకు 120 మందికి దుప్పట్ల పంపిణీ చేశారు. ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాకర్ల రాజరాజేశ్వరి, లయన్స్ ఆర్చిగుంట్ల కృష్ణమూర్తి, వృద్ధుల సంఘం కార్యదర్శి అడవి సుబ్బారావు, పేర్ల ప్రసాద్, షరీఫ్ లయన్ ఎండి అహ్మద్, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

బాలికల వికాసానికి విద్యే పునాది

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బాలికల వికాసానికి, సామాజిక పురోగతికి విద్యే పునాది అని ఎపి నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆదేశాలమేరకు మార్కాపురం, చిలకలూరిపేట, ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన 50 మంది ఇంటర్మీడియట్ విద్యార్థినులు బుధవారం ఎపి నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయాన్ని, వర్క్‌షాపులను పరిశీలించారు. యంత్రాల పనితీరు, వాటి ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారి విజయానికి మెట్టుగా నిలిచినపుడే ఉన్నత శిఖరాలను అధిరోహించటం సాధ్యమవుతుందని తెలిపారు. బాలికలు ఉన్నత చదువులు చదువుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, కె.మాధురి, యామిని, బి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 పట్ల అందరికీ అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ శ్రీనివాస్ దొర అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఒకరోజు సమావేశంలో మాట్లాడుతూ వివాహ వయసు రాని వారికి వివాహం జరుపకుండా చేయాలని, దీనిపై ప్రతిఒక్క తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే లక్ష్యం అన్నారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ అనిత కుమారి, మండల విద్యాశాఖ అధికారి సుభాకర్, ఐసిబిఎస్.విజయ్ కుమారి, అంగన్వాడీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితులలోను ప్రోత్సహించరాదని తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు అన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టాలపై అవగాహనా సదస్సులను బుధవారం వీరవాసరం మండల పరిషత్ కార్యయలంలో నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో బాల్యవివాహాల నిషేధిత చట్టాలను ఎంపిడిఒ వివరించారు. ఫోక్సో, బాల్యవివాహాల నిరోధక, బాల్యవివాహాల నిషేధిత చట్టాలను అధిగమిస్తే ఎదురయ్యే పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయసారధి, ఎంఇఒ శ్రీమన్నారాయణ, సిడిపిఒ లక్ష్మీకాంతం, సిహెచ్ఒ.దేవదాసు, అంగన్‌వాడీలు, జిఎంస్‌కెలు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఆదాయం లేదు.. సహకారం లేదు

సర్టిఫికెట్లు ఎందుకు?

నిలదీసిన గుమ్ములూరు సర్పంచి కోట అనంతలక్ష్మి

ప్రజాశక్తి - ఆకివీడు

పంచాయతీకి ఆదాయం లేదు, అభివృద్ధికి ఏ ఒక్కరి సహకారం అందించడం లేదు, చెత్తతో సంపద సృష్టిస్తామంటూ సర్టిఫికెట్లు ఇస్తున్నారు, వీటితో సరిపెట్టినట్టేనా ఎందుకు ఈ సర్టిఫికెట్లు మాకు అంటూ ప్రశ్నించారు మండలంలోని గుమ్ములూరు గ్రామ సర్పంచి కోట అనంతలక్ష్మి. మండలంలోని సర్పంచులకు ఆయా గ్రామాలలో చెత్తని సద్వినియోగం చేసే అంశం, పంచాయతీల అభివృద్ధి తదితర అంశాలపై గత మూడు రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచ్ల అభిప్రాయాలను మాట్లాడవలసిందిగా కోరినప్పుడు గుమ్ములూరు సర్పంచి తన అభిప్రాయాన్ని తెలియపరిచారు. గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రూ.8 లక్షలు కావాలి ఎవరూ సహకరించడం లేదు, డంపింగ్ యార్డ్ ఎక్కడో నిర్మించారు, అందుకు అవసరమైన రోడ్డు లేదు, చెత్త బండి అక్కడికి వెళ్లదు, ఎందుకు నిర్మించారో అర్థం కాదు, నిర్ణయాలు అధికారులది, అమలు మాదా? అని ఆమె ప్రశ్నించారు. గత 40 సంవత్సరాల పంచాయతీ బిల్లు ఒక్కసారిగా మా మీద పడేశారు, ఇదే పంచాయతీల అభివృద్ధా అంటూ ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. అందుకు ఎంపిడిఒ వాణి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కాలేదని, త్వరలో అన్ని సమస్యలు సర్దుకుంటాయని సహకరించాలని కోరారు. పలువురు సర్పంచులు, కార్యదర్శులు మాట్లాడిన అనంతరం సర్పంచులకు మూడు రోజుల శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కటారి జయలక్ష్మి, ఇఒపిఆర్‌డి, ఆర్‌డికెవి.సుబ్బారావు, పలు గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రాజులపేట సర్పంచి నరసింహారాజు

దశలవారీగా డ్రెయిన్ల ప్రక్షాళన

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని రైతుల సంక్షేమానికి బాసటగా నిలిచేందుకు దశలవారీగా డ్రెయిన్స్ పక్షాళన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం గూట్లపాడు, పొలిమేర తిప్ప డ్రెయిన్‌లో జరుగుతున్న కిక్కిస తొలగింపు పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దశలవారీగా జిల్లాలోని డ్రెయిన్స్, కాలవల్లో గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల జిల్లాలోని వేలాది ఎకరాలు ముంపుకు గురికాకుండా ప్రయోజనం చేకూతుందన్నారు. వీటి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలను సిద్ధంచేసి ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. ఇప్పటికే కొన్ని కాలువలు, డ్రెయిన్స్‌లో తూడు తొలగింపు పనులకు నిధులు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల అభ్యర్థన మేరకు పొలిమేరతిప్ప డ్రెయిన్ కిక్కిస తొలగింపుకు అత్యవసరంగా భావించి జిల్లా నిధులనుంచి రూ.5 లక్షలు నిధులు కేటాయించి, పనుల ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పనులు గూట్లపాడు గ్రామం వద్ద పొలిమేరతిప్ప డ్రెయిన్ 1.95 కిలోమీటర్ల నుంచి 5.1 కిలోమీటర్ల వరకు కిక్కిస తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే నీటిపారుదల సాఫీగా జరిగి కొత్తపాసులమఠ్రు, లోసరి, తోకతిప్ప, గూట్లపాడు గ్రామాల్లో దాదాపు 2 వేల ఎకరాల పంట పొలాలను ముంపు బారి నుంచి రక్షించవచ్చని తెలిపారు. ఈ పర్యటనలో డ్రెయిన్ ఇఇ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, భీమవరం తహశీల్దార్ రావి రాంబాబు, వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.